
క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి: త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు ఆదివారం ఉదయం అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సోమవరం, తుమ్మగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో 133 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

ఆకట్టుకున్న కళాజాతా ప్రదర్శన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బస్సు కళా జాతా యాత్ర కొండపల్లి క్రాంతి హైస్కూల్‌కు శనివారం చేరింది. ఈ సందర్భంగా కళాజాతా బృందం ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. సాంస్కృతిక నృత్యాలు, మ్యాజిక్ షో అలరించాయి. జేవీవీ రాష్ట్ర నాయకులు మురళీధర్ మాట్లాడుతూ సైన్స్‌పై అవగాహన, మూఢ నమ్మకాల నిర్మూలనలో భాగంగా గత ఏడాది నవంబర్ 7 నుంచి ఫిబ్రవరి 28 వరకు సైన్స్‌పై ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. మన రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు 2 వేల కిలో మీటర్ల యాత్ర జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్, కార్యదర్శి గంగాధర్, డాక్టర్ మామిడి సీతారామారావు, పి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామ సచివాలయంలో శనివారం పేదల ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇప్పటివరకు కొత్తూరు తాడేపల్లి గ్రామ పరిధిలో 220 మంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాలను రిజిస్ట్రేషన్స్ చేయించుకున్నారని వీఆర్వో శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి ఇంటి స్థలాన్ని లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సచివాలయ సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

రహదారికి మోక్షం



చాట్రాయి: ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న రహదారికి మోక్షం కలిగింది. మండలంలోని చిత్తపూరు కమ్మటూరు నుంచి ముసునూరు మండలం సూరేపల్లి వెళ్లే రహదారి గోతులమయం కావడం, రెండు పక్కల ముళ్ల పొదలు ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను చిత్తపూరు గ్రామస్తులు ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం తన సొంత ఖర్చులతో రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదలను తొలగించి గ్రావెల్ ఏర్పాటు పనులను ఆయన ప్రారంభించారు. రోడ్డుకి మోక్షం కలగడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరువీధి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు మాదల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం



జి.కొండూరు: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. మండల పరిధి వెలగలేరు చనమోలు పకీర్రాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 45వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దాతలు అందించిన నగదు బహుమతిని ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రగుంట మార్తమ్మ, ఎంపీటీసీ మిక్కిలి వెంకాయమ్మ, చనమోలు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మాణం

పెనుగంచిప్రోలు: గ్రామంలో పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి శ్రీతిరుపతమ్మవారి ఆలయం వరకు జెడ్పీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించే తారురోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. కొద్ది రోజుల్లో పనులు పూర్తి చేస్తామని నాయకులు తెలిపారు. మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నియోజకవర్గానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులు వివిధ వ్యాధులకు చికిత్స చేయించుకునేందుకు గాని సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.15 లక్షలు మంజూరు చేయించి వాటికి సంబంధించిన చెక్కులను శుక్రవారం రాత్రి వారికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. పట్టణంలో రూ.1.60 కోట్లతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి వాటికి శాశ్వత భవనాలను నిర్మించామన్నారు. గ్రామగ్రామాన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందిని సైతం నియమించారని చెప్పారు. హెల్త్ క్లినిక్‌లలో 105 రకాల మందులు అందుబాటులో ఉంచడమే కాకుండా పలు రకాల రక్త పరీక్షలను సైతం ఉచితంగా నిర్వహిస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకు చికిత్స చేయించుకునేలా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తూ గ్రామగ్రామాన వైద్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ప్రజల ఆరోగ్యం పట్ల ఇంత శ్రద్ధ చూపిన దాఖలాలు లేవని చెప్పారు. ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, ఆగిరిపల్లి జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, అడవినెక్కలం సర్పంచి వేము రాజు, కౌన్సిలర్లు దాసరి మారు అప్పాజీ, జూట్రు మేరీరాణి, నాయకులు కంభాల రాంబాబు, దామెర ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమతత్వమే క్రీస్తు మార్గం

ఆగిరిపల్లి: ప్రేమ తత్వమే క్రీస్తు మార్గమని, ప్రతి ఒక్కరూ తోటివారితో ప్రేమానురాగాలతో జీవనం సాగిస్తే సమాజానికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నరసింగపాలెంలో శనివారం సీఎస్ఐ చర్చికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జార్జ్ కార్నేలియస్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, సర్పంచ్ మొగుదాటి అనూష, పురుషోత్తం, సంఘస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగం..

ముసునూరు: ఆరోగ్యశ్రీ పరిధిలో లేని రోగులను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపకరిస్తుందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలానికి చెంది, వివిధ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన రోగులకు శుక్రవారం రాత్రి ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కాట్రేనిపాడుకు చెందిన గండేపూడి యువరాజు గుండె సంబంధిత చికిత్సకు రూ.65,000, అక్కిరెడ్డిగూడెంకు చెందిన చల్లగుళ్ల నాగమణి ఇన్ఫెక్షన్ నివారణ చికిత్సకు రూ.65,000, గుళ్లపూడికి చెందిన వలసపల్లి విజయలక్ష్మి మోకాలు శస్త్ర చికిత్సకు రూ.లక్షా 30 వేల విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పుచ్చకాయల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కంభాల రాంబాబు, సీనియర్ నాయకులు వలసపల్లి రాముడు, కంభాల దాసు తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ఐ చర్చికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ముసునూరు: వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్లు తమ ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు సౌకర్యాలు కల్పించాలని డీటీ ఎమిలీకుమారి ఆదేశించారు. మండలంలోని సూరేపల్లి, రమణక్కపేట హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఎంపీడీఓ పద్మావతిదేవితో కలిసి పరిశీలించారు. ఓటర్లకు అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను, బీఎల్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.వాసు, వీఆర్వోలు, బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ముసునూరు: చింతలవల్లి శివారు గోగులంపాడులో కోడిపందేల శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పి.వాసు చెప్పారు. వారి నుంచి రూ.78,500 నగదు, ఒక కారు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితులను సోమవారం నూజివీడు కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



నూజివీడు: తెలంగాణకు చెందిన మద్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను నూజివీడు ఎస్ఈబీ అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఈబీ ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... నూజివీడు మండలం సిద్ధార్థనగర్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంలో మద్యం సీసాలను తరలిస్తున్న ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పనవీడుకు చెందిన దేవనబోయిన సురేష్, కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం వేంపాడుకు చెందిన కొలుసు శివబ్రహ్మంలను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 44 బ్రాంది సీసాలు, బైక్ స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేశారు.

చనమోలు వెంకట్రావు సేవలు ఎనలేనివి



జి.కొండూరులో కేకు కట్ చేస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మైలవరంలో నివాళులర్పిస్తున్న తిరుపతిరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు

జయంతి కార్యక్రమాల్లో వక్తల నివాళి

మైలవరం: మాజీ మంత్రి దివంగత చనమోలు వెంకట్రావు చిరస్మరణీయుడని, మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. చనమోలు వెంకట్రావు జయంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక మూడు విగ్రహాల కూడలిలో వైఎస్ రాజశేఖరరెడ్డి, చనమోలు వెంకట్రావు, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుపతిరావు మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మైలవరంలో వాగులపై వంతెనలు నిర్మాణానికి, రహదారుల అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారని చెప్పారు. విజయవాడలోని విజయ మిల్క్ ప్రాజెక్టు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి కృషి చేశారన్నారు. మైలవరంలో ఆర్‌అండ్‌బీ డివిజనల్ కార్యాలయం ఏర్పాటు చేసి పలువురుకి ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత ఆయనదేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఉప సర్పంచ్ చామల సీతారెడ్డి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు పాల నారాయణరెడ్డి, రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గ అభివృద్ధిలో దివంగత మాజీ మంత్రి చనమోలు వెంకట్రావు సేవలు ఆదర్శనీయమని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. చనమోలు వెంకట్రావు జయంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు ఆధ్వర్యంలో జి.కొండూరులోని కొత్తూరు రోడ్డు వద్ద గల ఆయన విగ్రహం వద్ద శనివారం నిర్వహించారు. వెంకట్రావు, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకును కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో ఎంపీపీ పాలడుగు జోత్స్న ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు చనమోలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మైలవరం నియోజకవర్గానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కొండపల్లి మున్సిపాల్టీ సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు దుర్గాప్రసాద్, లంకే గోవిందరాజు, నల్లమోతు రవి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో శతాబ్ది ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. శత వసంతాల మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు లక్షలాదిగా తరలి వస్తున్నారు. పుణ్యక్షేత్ర ప్రాంగణం యాత్రికులతో నిండిపోయింది. ఏలూరు రోడ్డులోని మేరీమాత ఆర్చి నుంచి పుణ్యక్షేత్రం ప్రధానాలయం, మేరీమాత స్వరూపం, కొండ శిఖరాగ్రం వరకు భక్త జనం బారులు తీరారు. దీంతో కొండ పై గల మెట్ల మార్గాలు, కాలిబాటలు కిక్కిరిసిపోయాయి. శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుణదల కొండ రాత్రి సమయంలో విద్యుద్దీప కాంతులతో మెరిసిపోతోంది. ఆదివారం ఉదయం 6:30 నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– గుణదల (విజయవాడ ఈస్ట్)



ఉదయపు ప్రార్థనలో పాల్గొన్న ఫాదర్లు



గ్రౌండ్‌లో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



భక్తులకు సత్ప్రసాదం అందిస్తున్న ఫాదర్



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

శోభనాచలుడి రథసప్తమి ఉత్సవాలు ప్రారంభం



శోభనాచల స్వామికి పూజలు జరిపిస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శోభనగిరిపై స్వయంభు శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నృసింహస్వామి మాఘ మాస రథసప్తమి ఉత్సవాలు శనివారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ఉదయం 9 గంటలకు పంచామృత కలశ స్నపన, స్వామి, అమ్మవార్లకు విశేష అష్టోత్తర శత రజత తులసీ దళార్చనను విజయవాడకు చెందిన అవ్వారు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిపించారు. రాత్రి 7 గంటలకు పెళ్లి కుమారుడు అలంకరణలో చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామి వారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామోత్సవం కల్యాణ మండపం వద్దకు చేరుకోగా భక్తులు విశేష సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ భవానీ పర్యవేక్షించగా, ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

శోభనాచలుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి మొదటి రోజైన శనివారం రాత్రి ఆలయ ధర్మకర్త యలమర్రు ఎస్టేట్ జమీందారు వంశస్తులైన నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో స్వామివారికి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ మహోత్సవంలో స్వామివారికి వంశపారంపర్య ధర్మకర్త ప్రతాప్ అప్పారావు పట్టువస్త్రాలు సమర్పించి ఉభయదాతగా వ్యవహరించారు. ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, నక్కనబోయిన శ్రీమన్నారాయణ, చిమట శ్రీనివాసరావు, వాకా సక్కేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అవసరం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి

డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి

మైలవరం: విద్యార్థులు తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునే విధంగా పూర్వ విద్యార్థులు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. డాక్టర్ హనిమిరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు వివిధ దేశాలలో ఉన్నతమైన ఉద్యోగాలు నిర్వహిస్తున్నందుకు హర్షం వ్యక్తంచేశారు. తమకు వీలున్నప్పుడు కళాశాలకు విచ్చేసి తగు సలహాలు, వారి అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాదరెడ్డి ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో అవసరమన్నారు. దేశ, విదేశాల నుంచి సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండో శనివారం పూర్వ విద్యార్థుల దినోత్సవంగా జరుపుతున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు మాట్లాడారు. కార్యక్రమంలో 1999వ సంవత్సరం కళాశాలలో చేరి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరినాథరెడ్డి, తిమ్మారెడ్డి, డీన్స్, వివిధ విభాగాల అధిపతులు, స్టూడెంట్ కో–ఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో బూత్ కమిటీలే కీలకం

నల్లగట్ల స్వామిదాసు



బూత్ కమిటీల సభ్యుల సమావేశంలో పాల్గొన్న స్వామిదాసు

తిరువూరు: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ కమిటీలు క్రియాశీలకంగా వ్యవహరించాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని 7, 12 వార్డుల బూత్ కమిటీల సభ్యులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఓటరూ బూత్ వద్దకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా బూత్ కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమేనని చెప్పారు. ఇప్పటి నుంచే బూత్ కమిటీలు, పోలింగ్ ఏజెంట్లు సమన్వయంతో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, గుమ్మా వెంకటేశ్వరి, బూత్ కమిటీ సభ్యులు అంబటి నారాయణరెడ్డి, బాలకృష్ణ, గత్తం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

చింతలవల్లి (ముసునూరు): ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామానికి చెందిన పాలవెల్లి జగన్నాథరావు కుమారుడు శ్రీనివాసరావు (47) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం అతని భార్య వీరకుమారి, పెద్ద కుమార్తెతో కలిసి ఉయ్యూరు మండలం పెద ఓగిరాలలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి రాత్రికి ఇంటికి వచ్చిన శ్రీనివాసరావు తండ్రి జగన్నాథరావుతో కలిసి భోజనం చేశాడు. అనంతరం నిద్రకు ఉపక్రమించారు. శనివారం ఉదయం శ్రీనివాసరావు ఎంతకూ బయటకు రాకపోవడంతో తండ్రి అనుమానించి లోపలికి వెళ్లి చూడగా కుమారుడు ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ ఫణి భూషణరావు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

మొర్సుమల్లి(మైలవరం): వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చి వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని మొర్సుమల్లి సర్పంచ్ మాడపాటి శ్రీనివాసరావు అన్నారు. మైలవరం మండలం మొర్సుమల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు శనివారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ మైలవరం సీటును గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇద్దామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మైలవరం మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, వి. రామారావు, తోట తిరుపతిరావు, ఎన్. దుర్గాప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రేమ్ నికేతన్ దివ్యాంగుల సేవా సంస్థకు ప్రవాస భారతీయులు కన్నా ప్రవీణ్, సౌమ్య దంపతుల ఆర్థిక సహాయంతో నిత్యావసర సరుకులు శనివారం పంపిణీ చేశారు. గుడ్ సమరిటన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ హోమ్‌లో ఉన్న బాలబాలికల సహాయార్థం సరుకులు అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు చిట్టేలు కోటేశ్వరరావు మాట్లాడుతూ ట్రస్ట్ సేవలను వివరించారు.